# నేల విడిచిన సాము

"ఏమిటి సూర్యనారాయణా! పండగపూట పొద్దున్నే రాస్తూకూచున్నావే?"

'ఆఁ! నువ్వా! రావోయ్! ఏమిటిలా పొద్దున్నే దయ చేశావ్! కూర్చో!' అన్నాడు సూర్యనారాయణ—రాసిన కాగితాలు సర్దుకుంటూ.

సూర్యనారాయణ పక్కగా నేను కుర్చీ లాక్కొని కూర్చున్నాను.

"అమ్మాయ్! ఇంకోగ్లాసు కాఫీ తీసుకురా!" అని ఇంట్లోకిచూస్తూ అన్నాడు.

'ఇప్పుడే తాగివస్తున్నాను! నాకొద్దుకాఫీ!' అన్నాను.

నా మాట వినిపించుకోకుండానే మళ్ళీ కేకవేశాడు ఇంట్లోకి సూర్యనారాయణ.

"తాగొస్తే మాత్రమేం? మళ్ళీ ఓ గ్లాసుడు కాఫీ తాగలేవ్? మాటలుచూస్తే కోటలు దాటుతాయ్? బూజుపట్టి పోయిన సాంఘికవ్యవస్థను బద్దలు కొట్టానంటావ్?—" సూర్యనారాయణ తన ధోరణిలో పడ్డాడు.

సూర్యనారాయణ చిత్రమైన మనిషి. అతనికి ఓ రకమైన ధోరణి వుంది. ఏ విషయాన్నయినా సునాయాసంగా తన ధోరణిలోకి లాక్కుంటాడు.

సూర్యనారాయణ తన ధోరణిలో పడినప్పుడు తను అయోమయంలో పడటమే గాకుండా ఎదటివాళ్ళనుకూడా అయోమయంలో పడేస్తాడు. అతని మాటల్లో కంటే మనిషిలో ఎక్కువ వుద్రేకం కనపడుతూంది. తన వాదాన్ని అవతలివాళ్లు వొప్పుకుంటున్నారా లేదా అని కాదు అతడు చూసేది. వాళ్లు నోరు మూసుకొన్నారా లేదా అని! అసలువిషయం ఏదైనా, భావ స్వాతంత్ర్యాన్ని గురించి మాట్లాడకుండా వుండలేడు. అతని మాటల్లోనూ, వాదనలోనూ వుండే భావ స్వాతంత్ర్యం మనిషిలో కనిపించదు. ఎందుకంటే ఒక ఐదు నిముషాలు మాట్లాడక ఫలానా రచయిత యిలా అన్నాడు అంటాడు. సూర్యనారాయణతో మాట్లాడటం చాలా పెద్దచిక్కు! మనం నోరు తెరిచి మాట్లాడితే సరి—"నువ్వు ఫలానా పుస్తకం చదివావా?" అంటాడు.

చదవలేదన్నామో, యిహ మన కొంప ఆరిపోయినట్టే! సూర్యనారాయణ ఒక చిరునవ్వు పారేసి తాపీగా మొదలు పెట్టాడు. ఇహ మనం ఓ పావుశేరు బెల్లంగడ్డ నోట్లో పెట్టుక్కూచోవచ్చు!

సూర్యనారాయణ సరిగ్గా గంటసేపు పక్కా మెటీరియలిస్టుగా మాట్లాడి అప్పుడప్పుడు వేదాంతంలో పడిపోతాడు. అందులోనూ చాలా నాసిరకం వేదాంతంలోనే పట్టాడు.

"మనం ఎందుకు బతుకుతున్నాం?" అంటాడు నొసలు విరిచి.

నాకు వొకసారి వొళ్ళు మండిపోయి అనేశాను:

"ఫస్టు తారీఖున పాలవాడికీ, లాండ్రీవాడికీ బాకీలు తీర్చడానికి!" అని.

సూర్యనారాయణ ఓ క్షణంపాటు నివ్వెరపోయి అన్నాడు:

"నీవన్నీ చాలా లో చేస్తున్న!"

సూర్యనారాయణ నన్నేమన్నా నా మాటకు బిత్తర పోయిన మాట నిజం. పెళ్ళాం బిడ్డలూ, బాధ్యతలు లేని ఏ సన్యాసో 'మనం ఎందుకు బతుకుతున్నాం' అంటే అర్థం ముందేమోకాని ముగ్గురు బిడ్డల్నూ, భార్యనూ నూరు రూపాయల జీతంతో పోషించాల్సిన సూర్యనారాయణ ఆ మాటనే సరికి నేను సహనాన్ని కోల్పోయాను.

"ఇదిగో! నిన్నే! ఒక గ్లాసుతో కాఫీ పంపు!" రాసిన కాగితాలు పేజీలవారిగా పెట్టుకుంటూ లోపలికి కేక వేశాడు సూర్యనారాయణ.

"పాలు లేవు, నాన్నా! తమ్ముడు తాగేశాడు" సూర్యనారాయణ పెద్దకూతురు లోపలనుంచే సమాధానం చెప్పింది.

సూర్యనారాయణ అదోలా నా మొహంలోకి చూశాడు.

"ఫర్వాలేదులే! వొకసారి తాగొచ్చానుగా! ఏమిటి రాశావ్?" అన్నాను.

చెప్పడం మరిచాను సూర్యనారాయణ చెయ్యి తిరిగిన రాతగాడే! కవిత్వం కట్టాడు. కథలు రాస్తాడు. విమర్శలు చేస్తాడు. అతని కవిత్వంలోనూ, కథల్లోనూ మాటల గారడీ, భావాలకూటూ చేస్తాడు. అతని విమర్శల్లో అన్ని "ఇజాలను" కిచిడి చేసివేస్తాడు. అదేమిటోయ్ అంటే అదంతా భావ స్వాతంత్ర్య మంటాడు. "ఇలియట్, రసెల్, వైల్డూ-" అని ఆరంభించాడంటే నమస్కారం కొట్టి లేవడంకంటే మరో మార్గం వుండదు.

ఇంతకీ వొక్క మాటలో చెప్పాలంటే సూర్యనారాయణ కవీ, కథకుడూ, విమర్శకుడూ, రాజకీయవాది !

“నీక్కూడా ఆ జబ్బే పుట్టిందే ?” అన్నాడు సూర్య నారాయణ నా కళ్ళల్లోకి చూస్తో. వీపుమీద కొరడాతో చరిచి నట్లయింది నాపని!

అతడితో అక్కడే పేచీ ! తలాతోకలేకుండా మాట్లాడుతాడు.

“అంటే ?” అన్నాను.

“అదే ! యీ వారం పత్రికలో నీ కథ చదివాలే ! ఆ శర్మకు పుట్టినపుండే నీకూపుట్టింది! ఏవో సిద్ధాంతాలు ఋజువు చేయడానికి ప్రయత్నంచేశావు. అలాటి రచనలకు సాహిత్యంలో స్థానంలేదు. ఇదివరకే నీ కథలు బాగుండేవి !” అన్నాడు సూర్యనారాయణ.

అడపాదడపా నేనూ రాస్తూవుంటాను. కాని సూర్య నారాయణ యింతవరకూ ఆ కథలేవీ బాగాఉన్నాయి అన్నట్టు గుర్తులేదు. కాని యివాళ అంటున్నాడు.

“ఆ కథలో నేను ఏ సిద్ధాంతాన్నీ ఋజువు చేయటానికి ప్రయత్నించలేదు. ఆ సంఘటన మా వూళ్ళో జరిగిందేను. అందులోని కథానాయకుడు యింకా బతికేవున్నాడు. పోతే నేను చేసిందల్లా జీవితసత్యాన్ని ఆర్టురూపంలో అందించడమే ! నీదృష్టిలో ఏదైనా సిద్ధాతం ఆ జీవిత సత్యాన్ని రుజువుచేస్తుంటే ఆ తప్పు నాదికాదు. ఏమంటావ్!”

“అదంతా ప్రచారసాహిత్యం! దానికి కళావిలువలు లేవు! నువ్వు ప్రయోజనాభిలాషివి!”

సూర్యనారాయణ తన ధోరణిలో పడ్తూన్నట్టు సూచనలు కన్పించినయ్.

'అదికాదు సూర్యనారాయణా! నువ్వు ప్రయోజనాన్ని ఆశించకుండా నీ జీవితంలో నువ్వుచేసిన వొక్కపని చెప్పుచూదాం! దాదాపు నలభై ఏళ్లు వచ్చాయికదా వొక్కటి చెప్పు!'

'హిజ్‌మాస్టర్స్ వాయిస్‌లా నువ్వూ ఆ రావుమార్కు రికార్డు పెట్టావల్లే వుందే! ఆ వాదనలూ నాకు తెలుసులే!' సూర్యనారాయణ ఇంగితజ్ఞానం పోయినప్పుడల్లా 'రికార్డు' అస్త్రాన్ని ప్రయోగిస్తాడు. అతని ఎత్తుగడల్లో అదొకటి.

సూర్యనారాయణ పూర్తిగా తన ధోరణిలో పడకముందే అనేశాను—

"నువ్వు చేసే ప్రతిపనీ ప్రయోజనం ఆశించే చేస్తావు. అందులో స్వార్థం వుండొచ్చు! లేకపోవచ్చు! అది ఆత్మ సంతృప్తికే కావొచ్చు! కాక లోకకల్యాణంకోసం కావొచ్చు. కాని ప్రయోజనం వుంటుంది! వుండితీరాలి! పిచ్చివాళ్లు చేసే పనులకుమాత్రం అర్థం, ప్రయోజనం వుండకపోవచ్చు!"

"అబ్బా! నీ రికార్డు కాస్త ఆపరా బాబూ!" ఈసడింపుగా అన్నాడు సూర్యనారాయణ.

"సరేగాని రస్సెల్ రాసిన 'పవర్' చదివావా?" సూర్యనారాయణ తన ధోరణిలో పడ్డాడు. ఇక అంతుదొరకదు. నల్లేరుమీద బండి నడకలా సాగిపోతాడు.

విషయం మారిస్తేగాని అతడి ధోరణి ఆగదు. ఏమీ తోచక యింట్లోకి తొంగిచూశాను.

సూర్యనారాయణ పెద్దకూతురు యెనిమిదేళ్ళది వొక పెద్ద కడవ చంకన పెట్టుకొని మోయలేక వొకపక్కకు ఒరుగుతూ వాళ్ళ అమ్మవెనకే పోతూంది.

"పాపా, యిలారా!" అని పిలిచాను ఆ పిల్ల వెనక్కు తిరిగి నావైపు చూసి అంది—

"ఉఁహూఁ! పంపు కట్టేస్తారు, నీళ్ళు తేవాలి."

మళ్ళీ తల్లివెనకే కడవమోసుకొని వెళ్ళింది ఎంతో బాధ్యత నెత్తిన వేసుకొన్నదానిలా.

"ఏం నీళ్ళమోత మీ అమ్మాయి కప్పగించావ్? పనిమనిషేమైంది సూర్యనారాయణా?" అన్నాను.

'ఆఁ, పనిమనిషా! మాన్పించాను. యీ ఫస్టునుంచీ రావడంలేదు!' అన్నాడు సూర్యనారాయణ అదోలా మొహం పెట్టి.

"ఏం ఎందుకని?"

"దానికి రెండుపూటలూ అన్నం పెట్టి ఎనిమిది రూపాయలివ్వాలట! ఎవడిస్తాడీరోజుల్లో? మానుకో మన్నాను."

"ఏమిటోలేవోయ్! నా పనీ అలాగే వుంది. రూపాయకి అర్ధరూపాయకీ తడుములాడుకోవాల్సి వస్తుంది."

సూర్యనారాయణ యిరుకున పడినవాడిలా మొహం పెట్టాడు. తన ఆర్థికస్థితిని గుర్తుచేసి తన భావస్వాతంత్ర్యాన్ని అరికట్టి చిత్తుచేయడానికి ప్రయత్నిస్తున్నా ననుకొన్నాడు. నిజంగా నా మాటల్ని అపార్థంచేసుకొన్నాడు.

"మీ ముఠావాళ్ళకు సొంతబుర్రల్లేవు! ఎప్పుడో ఎవడో చెప్పింది చిలకల్లా పలుకుతారు! అంతే!" ముక్కుపుటా లెగరేస్తూ అన్నాడు.

నేను మౌనంగా చూశాను.

సూర్యనారాయణ దెబ్బతిన్న పులిలా చూస్తూ అన్నాడు—

"ఆకలీ, సమస్యలూ, సాంఘిక ప్రయోజనాలూ తప్ప నీ బుర్రకు మరోటి తోచదు."

'ధన్' మని యింట్లో నీళ్ళబిందె ఎత్తిపెట్టిన చప్పుడైంది. సూర్యనారాయణ పెళ్ళాం ఎవరినో ఝాడించేస్తోంది.

"ఏవిఁటీ గోల!" అంటూ సూర్యనారాయణ రయ్యిన యింట్లోకి పోయాడు.

ఆవిడ వాలకంచూస్తే నీళ్ళపంపుదగ్గర ఏదో పెద్ద గొడవ జరిగినట్టే వుంది. తలంతా రేగివుంది. చీర సగంపైగా తడిసిపోయి వుంది. కూతురు సొట్టపోయిన నీళ్ళబిందె పక్కన ఏడుస్తూ నుంచుంది. దొడ్డిగుమ్మం వెనకనుంచి గోల వినపడుతోంది.

"ఏవిటే గొడవా ?" అన్నాడు సూర్యనారాయణ.

"నా రాత! నా కర్మ!" తల బాదుకొంది సూర్యనారాయణ పెళ్ళాం.

"ఛా! ఏమిటే ఆ వాగుడూ ?" సూర్యనారాయణ గద్దించాడు.

"ఆడంగి వెధవ! పెళ్ళాన్ని వెనకేసుకొని ఆడవాళ్ళతో పోట్లాట్టాని కొస్తాడూ? వాడి పెళ్ళాంబతుకు వూళ్లో ఎవ రెరగందీ?" సూర్యనారాయణ పెళ్ళాం పంచాంగం విప్పింది.

"ఎవడే వాడూ? అసలు సంగతేమిటో చెప్పకుండా ఏమిటే ఆ ఏడుపూ?" సూర్యనారాయణ కోపంగా అడిగాడు.

"ఆఁ చెప్పొచ్చావ్ లే! అసలు నువ్వు మగాడి వయితే నా కిన్ని తిప్పలెందు కొస్తాయి?"

ఆవిడ మాట పూర్తిగాకముందే చెంప చెళ్ళుమంది!

మగాణ్ణి ఏ మాటంటే రెచ్చిపోతాడో, దేన్ని సహించ లేడో, ఎప్పుడు యుక్తాయుక్త జ్ఞానాన్ని మరిచిపోతాడో, ఆ మాటే అంది సూర్యనారాయణ పెళ్లాం.

సూర్యనారాయణ పెళ్లాన్ని కొట్టాడు! ఆవిడ ముఖాన గుడ్డవేసుకొని — "మా వాళ్లు నా గొంతు కోశార్రా!" అని శోకాలు తీయడం మొదలుపెట్టింది.

నాకు తల దిమ్మెత్తిపోయింది. ఇంట్లోనుంచి బయటి కొస్తే సూర్యనారాయణ ముహం యెలా చూసేది? ఇహ అక్కడ వుండలేకపోయాను. లేచి మెల్లిగా బయలుదేరాను.

సూర్యనారాయణ పెళ్ళాం మధ్య మధ్య ఏడుపు ఆపి అంటూంది:

"ఈ అరవచాకిరీ నే చేయలేను! పోషించడం చాతగాని వాడివి మా యింటికి నన్ను పంపరాదా?"

సూర్యనారాయణ కేకలతోనూ, పెళ్ళాం శోకంతోను, పిల్లల ఏడుపులతోనూ యిల్లు ప్రతిధ్వనిస్తోంది. పండుగపూట ఆనందంతో కలకల్లాడాల్సిన యిల్లు నరకకూపమైంది!

ఎలాగో వీధివాకిలిదాటి రోడ్డుమీద కొచ్చాను.

పాపం సూర్యనారాయణ మంచివాడే, స్నేహ పాత్రుడు. ఎందుకో నా మనసు పీకుతూవుంది అతడంటేను.

సూర్యనారాయణ యిల్లుదాటి యిరవై గజాలు రాగానే కొళాయిదగ్గర జనం మూగివున్నారు. అందులో ఎక్కువ మంది ఆడాళ్లే. తలోకమాటా అంటున్నారు.

'అయినా ఆడవాళ్ల తగాదాల్లో మగాళ్ళు కల్పించుకోవడం ఏమిటీ?' అని ఒకావిడంది.

"కాకపోతే సూర్యనారాయణ పెళ్ళాం, కనకాన్ని గెలవనివ్వకేం?" అంది యింకొక ఆవిడ.

"అదీ నిజమేనే? సూర్యనారాయణ పెళ్ళానికి మహా గర్వం! పుట్టింటివాళ్లకు డబ్బు బాగా వుందటలే!"

'ఎక్కడో వుంటే సరా? యిక్కడ మింగటానికే లేదుగా!'

'సుకుమారి! తనకు బిందెలు బుజాన వేసుకొని వచ్చే అలవాటు లేదంటా! అందుకని ముందు తన్ను నీళ్లుపట్టుకొని పోనివ్వాలట!'

"నలుగురు పనిమనుష్యుల్ని పెట్టుకోపోయిందీ—"

"నువ్వు సరేనే! వున్న పనిమనిషినే కికాణా లేక మాన్పిస్తేను!"

"ఒసే కనకం! మొగుడు సూర్యనారాయణతో చెప్పి ఆవిడ సొంతంగా యింట్లో కుళాయి వేయించుకుంటుందేమో?"

ఆ మాటకు కొళాయిచుట్టూ చేరిన ఆడవాళ్ళు వెకిలిగా నవ్వారు.

'ఏవమ్మోయ్! బిందె నిండింది! తీయ్?' ఒకావిడ బిగ్గరగా అరచింది.

'నన్ను ఈ ఒక్క బిందా పట్టుకెళ్ళనీయండర్రా!' అని లావుపాటిమనిషి ముందుకు తోసుకుపోయింది. దాంతో రభస ప్రారంభమయింది!

ఆ కొళాయిచుట్టూ పాతిక ముప్ఫయి ఖాళీ బిందెలు అడ్డదిడ్డంగా పడివున్నాయ్.

మానవుల విలువల్ని వెక్కిరిస్తూ కొళాయిలోంచి సన్నటి నీళ్ళధార బీదవాని వంటిపైని మురికి పేలికలా నల్లగా తెల్లగా కారుతోంది! చుట్టూవున్న ఖాళీబిందెలు నీళ్ళకోసం ఆతురతతో ఎదురుచూసే ఆడవాళ్ళ ముఖాల్లోకి వెలితిగా చూస్తున్నాయా?

స్వల్పమైన కనీసపు జీవితావసరాలు కూడా మానవుల్ని మానవత్వాన్నుంచి దూరం చేయగలుగుతున్నాయి.

ఐతే అన్నీతెలిసిన సూర్యనారాయణ యీ చిన్న విషయం ఎందుకు అర్థం చేసుకోలేదో యీ నాటికీ నాకు అర్థం కాలేదు. అది సూర్యనారాయణ తప్పా? రోజూ సాయంత్రం పార్కులో సూర్యనారాయణచుట్టూ చేరేవాళ్ళతప్పా? కాక యీమనిషే అంతా?